
సాక్షి ప్రకాశం

శనివారం । 31 । మే । 2025



ఉర్దూ బోధనకు ఉరి!

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీచర్ల బదిలీల ప్రక్రియ ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్యాయం చేసేలా ఉంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. - 10లో..



రెచ్చిపోయిన దొంగలు

బేస్తవారిపేట మండలం పీవీ పురంలో దొంగలు రెచ్చిపోయారు. ముగ్గురు సోదరుల ఇళ్లలో 23 తులాల బంగారం, రూ.65 వేల నగదు చోరీ చేశారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
37 /30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

నోటికాడ కూడు కాజేశారు



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు కొత్తపల్లి రాణి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా 15 సంవత్సరాలుగా అర్ధవీడులో పనిచేస్తున్నారు. రాణి భర్త ఆరేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ వచ్చిన జీతంతో తన ముగ్గురు పిల్లలను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే, గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీఓ శ్రీనివాసరెడ్డి అకారణంగా రాణిని విధులకు రానివ్వకుండా అడ్డుకున్నారు. కూటమి నేతల ఆదేశాలతో ఆమెను అన్యాయంగా తొలగించి ఇబ్బందులకు గురిచేశారు. 2024 జూన్ నుంచి జీతం కూడా ఇవ్వకుండా నిలిపివేశారు. భర్త కూడా లేని రాణితో పాటు ఆమె ముగ్గురు పిల్లల నోటికాడ కూడు కాజేశారు.

జీవనోపాధి కోల్పోయా



గత ఐదు సంవత్సరాలుగా ఎండీయూ ఆపరేటర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పెట్రోలు ఖర్చు, హెల్పర్ కూలి పోగా నెలకు పది వేల వరకు మిగిలి కుటుంబం గడిచిపోతోంది. ప్రభుత్వం రేషన్ డీలర్ల ద్వారా రేషన్ షాపుల్లోనే బియ్యం అందించాలని నిర్ణయించడంతో రోడ్డున పడుతున్నా. ఉపాధి కోల్పోయిన ఎండీయూ ఆపరేటర్లను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఆర్.పుల్లారావు, ఎండీయూ ఆపరేటర్, కంభం

సంపద సృష్టిస్తాం.. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం.. లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఎన్నికలప్పుడు కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే చిరుద్యోగులపై కక్షగట్టారు. వారు చేస్తున్న ఉద్యోగాలను నిర్దాక్షిణ్యంగా ఊడగొట్టి రోడ్డున పడేశారు. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు.. ఏళ్ల తరబడి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ డీలర్లు, ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, హెల్పర్లు, పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసే కార్మికులు, నైట్ వాచ్‌మెన్లు.. ఇలా జిల్లాలో సుమారు 18 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించి వారి పొట్టగొట్టారు.



కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో తొలగించిన ఉద్యోగుల వివరాలు...

వలంటీర్లు	12,489
మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు	178
మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్లు	356
మధ్యాహ్న భోజన పథకం కార్మికులు	3000
వైద్యశాలల్లో పనిచేసిన పారిశుధ్య సిబ్బంది	180
ఒంగోలు నగరంలో మేస్త్రీల సంఖ్య	45
ఒంగోలు నగరంలో పారిశుధ్య కార్మికులు	23
ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఖ్య	650
డ్వాక్రా వీఓఏలు	700

- లక్షల ఉద్యోగాలంటూ ఎన్నికల ముందు చంద్రబాబు హామీ
- వలంటీర్లకు రెట్టింపు జీతమంటూ నిట్టనిలువునా మోసం
- అధికారంలోకి వచ్చీరాగానే చిరుద్యోగులపై ప్రతాపం
- పారిశుధ్య కార్మికులనూ వేధించిన పాలకులు
- మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టకొట్టిన బాబు
- రోడ్డున పడిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు
- డ్వాక్రా వీఓఏలపై కూటమి కక్ష సాధింపులు

ఏడాది పాలన
ఇదేనా బాబూ!



హామీల బూచి.. జీవితాలు కూల్చి!

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రజలకు జీవనోపాధి చూపించాల్సిన ప్రభుత్వం రాజకీయ కారణాలతో వివిధ శాఖలకు చెందిన చిరుద్యోగులను తొలగించి వారి కుటుంబాలకు నిలువ నీడ లేకుండా చేసింది. ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న వారిని కూడా తొలగించి ఒంగోలులోని కలెక్టరేట్ ఎదురుగా నిరసన ప్రదర్శనలకు దిగినా పట్టించుకోలేదు. దీన్నిబట్టి కూటమి ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చని ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు.

వలంటీర్లను వంచించి...

అధికారంలోకి వస్తే రూ.10 వేలు ఇస్తామని, ప్రస్తుతం పనిచేస్తున్న వలంటీర్లను కొనసాగిస్తామని గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం జిల్లాలో పనిచేస్తున్న 12,489 మంది వలంటీర్లను కూటమి ప్రభుత్వం పీకేసింది. అప్పటి వరకు ఇంటింటికి అందించే పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను సైతం నిలిపివేసింది. వలంటీర్లకు బదులుగా ప్రభుత్వ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయిస్తోంది. వలంటీర్లు వివిధ మార్గాల్లో పోరాటాలు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే, చంద్రబాబు కేబినేట్‌లో ఉన్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వలంటీర్ల శాఖకు మంత్రిగా ఉండటం గమనార్హం.

కోర్టు ఉత్తర్వులు సైతం లెక్కచేయకుండా...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 5,500 మందికిపైగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులున్నారు. వీరిలో చాలా మంది 20 ఏళ్లకుపైగా పనిచేస్తున్నారు. ప్రభుత్వాలు సకాలంలో బిల్లులు చెల్లించకపోయినప్పటికీ అప్పులు చేసి వంట వండి పిల్లలకు భోజనం పెడుతున్నారు. ఎక్కువగా ఎస్సీ, బీసీ మహిళలే పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 3 వేల మందితో బలవంతంగా రాజీనామాలు చేయించింది. అయితే, కొంత మంది అంగీకరించలేదు. ప్రజా సంఘాలతో కలిసి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోరాటానికి దిగారు. కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నాలు చేశారు. మరికొందరు మాత్రం న్యాయస్థానాలకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. వారిని కూటమి నేతలు వేధించడం మొదలుపెట్టారు. ఇప్పటికీ ఆ వేధింపులు కొనసాగుతుండటం శోచనీయం. తాజాగా ఒంగోలు నగరంలోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిని తొలగించి తమ సొంత మనుషులను నియమించుకున్నారు. సెలవుల తర్వాత నుంచి విధులకు రావద్దని బెదిరిస్తున్నట్లు సమాచారం.

చిరుద్యోగుల పొట్టకొట్టి...

జిల్లాలో 1200 మంది డ్వాక్రా వీఓఏలు ఉన్నారు. వారిలో 700 మందిని ప్రభుత్వం తొలగించి వారికి అన్యాయం చేసింది. జిల్లాలో ఉన్న 178 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు 534 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు ఎత్తివేయడంతో వారంతా ఉద్యోగాలు కోల్పోయారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. పచ్చకూటమి పాలనలోకి రాగానే దాదాపుగా వారందరినీ తొలగించింది. గత వైఎస్సార్ సీపీ పాలనలో వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ తెచ్చి ఇచ్చేవారు. జిల్లాలో 385 వాహనాలు ఉండగా, వాటిని కూడా తీసేసి రేషన్ దుకాణాల వద్దకే వెళ్లి తెచ్చుకోవాలని ఆదేశాలిచ్చింది. కూటమి పాలనలో ఏ ఒక్క శాఖనూ వదలకుండా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలన్నింటిలో పచ్చమందను తెచ్చిపెట్టింది.

రోడ్డున పడిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలు...

కూటమి అధికారంలోకి రాగానే పారిశుధ్య కార్మికులనూ వదల్లేదు. వారిపై వైఎస్సార్ సీపీ ముద్ర వేసి ఉద్యోగాల నుంచి తొలగించేసింది. ఒంగోలు నగరంలో పనిచేస్తున్న 45 మంది మేస్త్రీలు, 23 మంది పారిశుధ్య కార్మికులను ఉన్నపళంగా తొలగించింది. స్థానిక ఎమ్మెల్యేను కలిసి మాట్లాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. రోజుల తరబడి దీక్షలు చేసినా పట్టించుకోలేదు. ఆప్కాస్‌ను రద్దు చేస్తామని ప్రభుత్వం చెబుతుండడంతో పారిశుధ్య కార్మికులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులకు వేతనాలు సక్రమంగా రావని, పీఎఫ్ చెల్లింపులు సరిగ్గా జరగవని, మొత్తం కార్మికుల ప్రాథమిక హక్కులు కాలరాసి బానిస వ్యవస్థను తయారు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని కూటమి పాలకులపై కార్మికులు మండిపడుతున్నారు. ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే పట్టణ ప్రజలకు పారిశుధ్య సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ప్రజాసంఘాలు ఆందోళన చెందుతున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్ల ఉపాధికి దెబ్బ...

జిల్లాలోని ఉపాధి హామీ పథకంలో 729 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాల్సి ఉండగా, వారిలో 60 పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. దీంతో 650 మందికిపైగా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగానే టీడీపీ నాయకులు వీరిపై దాడులు చేయడం మొదలుపెట్టారు. రేపటి నుంచి పనికి వస్తే ఊరుకోమంటూ హుకుం జారీ చేశారు.

రాజకీయంగా అధికారులపై ఒత్తిడి చేశారు. పోలీసుల ద్వారా బెదిరించారు. బలప్రయోగం చేస్తామంటూ వార్నింగులిచ్చారు. దాంతో కొందరు స్వచ్ఛందంగా ఉద్యోగం మానుకున్నారు. మరికొందరితో రాజీనామాలు చేయించారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో కొన్ని చోట్ల టీడీపీ కార్యకర్తలను నియమించుకున్నారు. మరి కొన్ని చోట్ల మాత్రం ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులను అమ్ముకున్నట్లు ప్రచారం జరిగింది. ఏదేమైనా కూటమి పాలకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి వారి ఉపాధిని దెబ్బకొట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్యోగాలు తీసేయడం దుర్మార్గం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం కల్పించి నెలకు రూ.21 వేల జీతమిచ్చారు. సొంత మండలంలోనే ఉద్యోగం చేసుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపాను. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వం మద్యం దుకాణాలు తొలగించి మాకు ప్రత్యామ్నాయం చూపించకుండా రోడ్డున పడేసింది. ఐదు నెలలుగా ఉద్యోగం లేక నానా అవస్థలు పడుతున్నా.

– టంగుటూరి రామకృష్ణ, కాకుటూరివారిపాలెం, టంగుటూరు మండలం

కూటమి పాలకులు నా నోటికాడ కూడు తీసేశారు



కూటమి ప్రభుత్వం వచ్చాక చిరుద్యోగులను తొలగించి వారి నోటికాడ కూడు తీసేసింది. నేను 2009 నుంచి ఎన్ఆర్ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. నెలకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకూ వేతనం లభించేది. భార్య, ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నా. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకుల ఒత్తిడితో అధికారులు నన్ను తొలగించారు. ప్రస్తుతం నా పరిస్థితి దయనీయంగా ఉంది. పొట్టకూటి కోసం బేల్దారి పనికి వెళ్తున్నా.

– పరిశపోగు జీవన్, దొడ్డిచింతల, హెచ్ఎం పాడు మండలం

వలంటీర్లకు ద్రోహం చేశారు



కూటమి ప్రభుత్వం వలంటీర్లను నిలువునా మోసం చేసింది. ఎన్నికల సమయంలో వలంటీర్ వ్యవస్థను కొనసాగించి నెలకు రూ.10 వేలు ఇస్తామని నమ్మించారు. తీరా అధికారంలోకి వచ్చాక అసలు ఆ వ్యవస్థే లేదని ఆ శాఖామంత్రి స్వామి అసెంబ్లీ సాక్షిగా చెప్పడంతో మేము మోసపోయామని అర్థమైంది. విజయవాడ వరదల సమయంలో మాత్రం మా సేవలు వినియోగించుకున్నారు.

– పిల్లిపోగు జీవన్‌కుమార్, మాజీ వలంటీర్, పొన్నలూరు

అకారణంగా మమ్మల్ని తొలగించారు





కొన్నేళ్లుగా కొనకనమిట్ల మండలం గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో వంట మనుషులుగా పనిచేస్తున్నాం. కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నేతలు కక్ష కట్టి ఐదుగురు వంట మనుషులకు రాజకీయ రంగు అద్ది అకారణంగా తొలగించారు. అధికారులు, హెచ్ఎం ద్వారా ఒత్తిడి తెచ్చి రాజీనామాలు చేసేదాకా ఒప్పుకోలేదు. ఆ వేధింపులు తట్టుకోలేక అందరం రాజీనామాలు చేశాం. కూటమి నాయకులు వారికిష్టం వచ్చిన వారిని వంట మనుషులుగా పెట్టుకున్నారు.

– దొంతిరెడ్డి తిరుపతమ్మ, జి.దుర్గ

మోసం చేసిన బాబు

- వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: కూటమి ప్రభుత్వానికి జూన్ 4వ తేదీకి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా బూటకపు పాలన చేస్తున్నందుకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పేరుతో నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. జూన్ 4వ తేదీ సంతనూతలపాడులో నిర్వహించనున్న వెన్నుపోటు దినంపై శుక్రవారం సాయంత్రం మద్దిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాగులుప్పలపాడు మండల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా నిలువునా మోసం చేశారన్నారు. ఈ దుర్మార్గపు పాలన వలన ఇప్పటికే ప్రజలు అన్ని విధాలుగా అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతాంగానికి చంద్రబాబు ప్రభుత్వం నిలువునా నడ్డివిరిచిందన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగయ్యే పొగాకు, మిర్చి, శనగకు కనీస మద్దతు ధర లేక, రైతుల వద్ద ఉన్న పంటను కొనుగోలు చేసే వారు లేక నిలువునా పంటలను తగలబెట్టే స్థితికి రైతాంగం వచ్చిందంటే ఈ ప్రభుత్వం రైతులను ఏ స్థాయిలో చిన్నచూపు చూస్తోందో అర్థమవుతోందని అన్నారు. సమస్యలన్నింటినీ ఈ చెవిటి ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు వైఎస్సార్ సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి ప్రజలు తరలిరావాలని మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, నాగులుప్పలపాడు మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, పార్టీ మేధావుల సంఘ రాష్ట్ర కార్యదర్శి కంచర్ల సుధాకర్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కందుల డానియేలు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొంజేటి సురేష్, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, దివ్యాంగుల విభాగం, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శులు కాట్రగడ్డ శ్రీనివాసరావు, పేరాల చెన్నకేశవులు, మహిళా విభాగం అధ్యక్షురాలు పోకూరి లక్ష్మి, మండల యూత్ అధ్యక్షుడు ఇమ్మిశెట్టి బాలకృష్ణ, బీసీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పాదర్తి శివ, పొట్టేటి అశోక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన ఒంగోలులోని పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ కార్యకలాపాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులంతా తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి పదవులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్టేట్ యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన మేరుగు చందన్‌నాగ్, జోనల్ ప్రెసిడెంట్‌గా కొండపికి చెందిన మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, సెక్రటరీగా గిద్దలూరుకు చెందిన నెమలిదిన్నె చెన్నారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సంతనూతలపాడుకు చెందిన పాకనాటి మహానందిరెడ్డి, కొండపికి చెందిన రావూరి వెంకట ప్రవీణ్ కుమార్, రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా కనిగిరికి చెందిన గంగసాని లక్ష్మి, స్టేట్ బీసీ సెల్ సెక్రటరీగా యర్రగొండపాలేనికి చెందిన మూడమంచు బాలగురవయ్య, స్టేట్ ఇంటలెక్చువల్స్ ఫోరం జనరల్ సెక్రటరీగా గిద్దలూరుకు చెందిన పి.వి.రంగారెడ్డి, స్టేట్ ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా మార్కాపురానికి చెందిన మాలపాటి బాలిరెడ్డి, స్టేట్ వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా యర్రగొండపాలేనికి చెందిన సూరే వెంకట రమేష్‌ను నియమించినట్లు పార్టీ కార్యాలయం ప్రకటించింది.

జలజీవన్ మిషన్‌ను సద్వినియోగం చేసుకోండి

- కేంద్ర ప్రత్యేకాధికారి వగీష్ తివారి



ఫారం పాండ్‌ను పరిశీలిస్తున్న వగీష్ తివారి

యర్రగొండపాలెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ మిషన్ ప్రత్యేకాధికారి డాక్టర్ వగీష్ తివారి సూచించారు. యర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన ఫారం పాండ్‌లు, గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తివారి మాట్లాడుతూ ఫారం పాండ్‌లతో రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. వీటి ద్వారా రైతులు పొలాల్లోనే నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. భూగర్భ జలాలు కూడా పెరుగుతాయన్నారు. ఆయా ప్రాంతాల్లోని రైతులంతా పొలాల్లో ఫారం పాండ్లు ఏర్పాటు చేసుకునేలా సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిల నుంచి సక్రమంగా నీటి సరఫరా జరుగుతుందా..? అని ప్రజలనడిగి తెలుసుకున్నారు. తాగునీటిని వృథా చేయకుండా ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం సచివాలయంలో నీటిని పరీక్షించే మిషన్ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, మురారిపల్లెలో ఉన్న ఫారెస్ట్ నర్సరీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జలజీవన్ మిషన్ నోడల్ అధికారి దినేష్ కుమార్ పేరివాల్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, మార్కాపురం క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఐటీడీఏ ప్రత్యేకాధికారి కె.నాగేశ్వరరావు, ఏపీవో శైలజ, ఈసీ లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

అనధికార మద్యం అమ్మకాలపై 504 కేసులు

- ఎక్సైజ్ ఈఎస్ ఖాజామొహిద్దీన్

ఒంగోలు టౌన్: జిల్లాలో గతేడాది అక్టోబర్ 16వ తేదీ నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న 504 మందిపై కేసులు నమోదు చేసి 498 మందిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఈఎస్ షేక్ ఖాజామొహిద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుల నుంచి 1,209 లీటర్ల మద్యం, 36 లీటర్ల బీరు, అక్రమ రవాణాకు వినియోగిస్తున్న 4 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం విక్రయాలకు సంబంధించి 9 కేసులు నమోదు చేసి 14 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 187 లీటర్ల మద్యం, 105 లీటర్ల బీరు, అక్రమ రవాణాకు వినియోగిస్తున్న 2 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాటుసారాకు సంబంధించి 70 మందిపై కేసులు నమోదు చేసి 33 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 232 లీటర్ల సారా, 17,655 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు తెలిపారు. 270 కేజీల నల్లబెల్లం రవాణా చేస్తున్న 7 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం కేసుల్లోని 2,380 మంది నిందితులను బైండోవర్ చేశామన్నారు. నలుగురిపై గంజాయి కేసులు నమోదు చేసి వారి నుంచి 1.74 కేజీల గంజాయి, 5 గంజాయి మొక్కలు, 2 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 103 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని, వారి నుంచి 13 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

తర్లుపాడు: తర్లుపాడులోని నీలంపాటి లక్ష్మీ అమ్మవారి పంచమదశ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నుంచి రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సీనియర్ విభాగంలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.40 వేలు, చతుర్ధ బహుమతి రూ.30 వేలతోపాటు 8 జతల ఎడ్ల యజమానులకు కన్సోలేషన్ బహుమతులు అందించనున్నట్లు వివరించారు. వివరాలకు 9440791698, 9640408773ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ తీగలు తెగి 4 దూడలు మృతి


మృతి చెందిన దూడలు

అర్ధవీడు: రోడ్డుపై 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడటంతో నాలుగు దూడలు చనిపోయిన సంఘటన శుక్రవారం అర్ధవీడులోని ఈద్గా సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడటంతో మామిళ్ల మల్లికార్జున రెడ్డికి చెందిన 4 దూడలు చనిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తీగలను సరిచేశారు.

ఉర్దూ బోధనకు ఉరి!

- ఉర్దూ విద్యార్థులకు అన్యాయం చేసేలా టీచర్ల బదిలీల ప్రక్రియ
- నిబంధనల ప్రకారం పీహెచ్ కోటా కింద 40 శాతం బదిలీలు
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పీహెచ్‌సీ కింద 8 పాఠశాలలు
- అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులు ముగ్గురు మాత్రమే..
- ఖాళీ పోస్టులు భర్తీ చేసి ఇబ్బంది లేకుండా చూడాలని తల్లిదండ్రుల వినతి


ఉర్దూ మీడియం విద్యార్థులు

కంభం: ప్రస్తుతం నిర్వహిస్తున్న టీచర్ల బదిలీలు ఉర్దూ మీడియం విద్యకు మైనారిటీ విద్యార్థులను దూరం చేసేలా ఉన్నాయని తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. బదిలీల్లో భాగంగా 8 సంవత్సరాలు లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు కచ్చితంగా మరో చోటకు వెళ్లిపోవాల్సి ఉంది. ఆ పాఠశాలల్లో తిరిగి ఉపాధ్యాయులను నియమిస్తే అక్కడ చదువుకునే ఉర్దూ మీడియం విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రస్తుత బదిలీల నిబంధనల ప్రకారం 40 శాతం ఖాళీలను పీహెచ్(ఫిజికల్లీ హ్యాండీక్యాప్) కోటా కింద భర్తీ చేయాల్సి ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ముగ్గురు మాత్రమే సీహెచ్ ఉపాధ్యాయులుండగా జిల్లాలో 8 పాఠశాలలను పీహెచ్ కోటాకు కేటాయించారు. పీహెచ్ కోటా ఉపాధ్యాయులు ఉన్న చోటే యథావిధిగా కొనసాగవచ్చని ఇప్పటికే కోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో వారు తమ స్థానాల్లోనే కొనసాగితే ఖాళీ అవనున్న ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండరని తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ విషయంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు ఎంఈఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా విద్యాశాఖాధికారులు మాత్రం స్పందించడం లేదు.

పీహెచ్ కోటా పాఠశాలలివే..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కంభం మండల కేంద్రం అర్బన్‌కాలనీ ఉర్దూ పాఠశాల, లింగోజిపల్లి ప్రాథమిక పాఠశాల, చీమకుర్తి ప్రాథమిక పాఠశాల, కందుకూరులోని సరూర్ నగర్ ప్రాథమిక పాఠశాల, పొదిలిలోని ప్రాథమిక పాఠశాల, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు, కొమ్మలపాడు ప్రాథమిక పాఠశాలలు, యర్రగొండపాలెం ప్రాథమిక పాఠశాలలు పీహెచ్ కోటా కిందకు వచ్చాయి. ఇక్కడ పనిచేసే ఉర్దూ ఉపాధ్యాయులు లాంగ్ స్టాండింగ్ కావడంతో వారు వెళ్లిపోనున్నారు. జిల్లాలో పీహెచ్ ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఈ పోస్టులన్నీ భర్తీ అయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో అక్కడ చదువుకునే ఉర్దూ మీడియం విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరగనుంది.


సమస్యలు ఎంఈఓకు వివరించేందుకు కంభం ఎమ్మార్సీ వద్ద వేచి ఉన్న ఉర్దూ టీచర్లు

హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ కానున్న యూపీ స్కూళ్లు

ఉర్దూ యూపీ స్కూళ్లలో 6, 7, 8వ తరగతుల్లో 30 మందికన్నా ఎక్కువగా విద్యార్థులుంటే వాటిని హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వైపాలెం, ఏల్చూరు, కొమ్మలపాడు, కందుకూరు, ఖాజీపాలెం, వలపర్ల యూపీ స్కూళ్లు ఈ విద్యా సంవత్సరం నుంచి హైస్కూళ్లగా మారనున్నాయి. ఈ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను భర్తీ చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లాలో ఉర్దూ మీడియం పాఠశాలల వివరాలు	
ప్రైమరీ స్కూళ్లు	31
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	8
హైస్కూళ్లు	1
2025-26లో హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ అయినవి	6
జూనియర్ కళాశాలలు	1(కంభం)
ఉర్దూను ఒక భాషగా బోధించే స్కూళ్లు	
ప్రైమరీ	37
అప్పర్ ప్రైమరీ	6
హైస్కూళ్లు	17

ఖాళీల వివరాలు	
జిల్లాలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులు	37
డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నవి	
ఎస్జీటీ	8
స్కూల్ అసిస్టెంట్	2

పిల్లలకు ఇబ్బంది లేకుండా చూడాలి



నా ఇద్దరు పిల్లలను ఉర్దూ మీడియంలో చదివిస్తున్నా. తెలుగు మీడియం ఉపాధ్యాయులు ఉర్దూ బోధించలేరు. కాబట్టి ఉర్దూ పాఠశాలల్లో ఉర్దూ బోధించేవారినే నియమించాలి. లేదంటే పిల్లలకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పఠాన్ రుక్సానా, విద్యార్థి తల్లి

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

జిల్లాలో ఉర్దూ పాఠశాలల్లో ఉన్న ఖాళీల వివరాలు, ఉర్దూ పాఠశాలల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– మొయినుద్దీన్, జిల్లా ఉర్దూ డీఐ

పేలిన గ్యాస్ సిలిండర్

- కర్రీస్ షాప్‌లో వంట సామగ్రి దగ్ధం
- తప్పిన పెను ప్రమాదం


సిలిండర్ పేలి దగ్ధమైన దుకాణం

పొదిలి: కర్రీస్ షాప్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు ఎగసిపడి వంట సామగ్రి దగ్ధమైన సంఘటన పొదిలిలోని విశ్వనాథపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. దర్శి అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు. వివరాలు.. విశ్వనాథపురంలోని కాలేజీ రోడ్డు మొదటి లైనులో కూరలు, పాలు విక్రయించే దుకాణంలో ఒక్కసారిగా సిలిండర్ పేలింది. అదృష్టవశాత్తు సిలిండర్‌లో గ్యాస్ స్వల్పంగా ఉండటం, జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భవనంపై భాగంగా పిల్లలకు డ్యాన్స్ నేర్పిస్తుంటారు. అక్కడ కూడా ఎవరూ లేక పోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కొంత మేర ఆస్తినష్టం సంభవించిందని యజమాని బంకా అనంతరావు చెప్పారు. రెగ్యులేటర్ ఆపకపోవడం, నాణ్యతలేని పైపును వాడటం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మూలంగానే ప్రమాదం చోటుచేసుకుందని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు.

నగల దుకాణంలో మహిళ చేతివాటం

మార్కాపురం: పట్టణంలోని ఓ నగల దుకాణంలో మహిళ చేతివాటం చూపి ఆభరణాలు అపహరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పట్టణంలోని చెన్నకేశవ స్వామి గుడి సమీపంలోని బంగారు నగల వీధిలోని ఓ దుకాణానికి మహిళలు వెళ్లారు. ఈ సమయంలో ఓ మహిళ దుకాణ యజమానిని ఏమార్చి ఆభరణం దొంగిలించి వెళ్లిపోయింది. సీసీ ఫుటేజీలో ఆలస్యంగా చోరీ విషయాన్ని గుర్తించిన షాపు యజమాని సదరు మహిళలను నిలదీశారు. దీంతో వారు తమ తప్పు ఒప్పుకొని ఆ ఆభరణాన్ని వెనక్కి ఇచ్చారు.

సత్తా చాటిన బాపట్ల జిల్లా ఎడ్లు


బండలాగుతున్న ఎడ్ల జత

రాచర్ల: మండలంలోని ఒద్దులవాగుపల్లె పంచాయతీ పరిధిలోని అచ్చంపల్లె గ్రామంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి నూతన విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి న్యూ కేటగిరీ ఎడ్ల బండలాగుడు పోటీల్లో బాపట్ల జిల్లా ఎడ్ల జతలు సత్తా చాటాయి. పోటీల్లో మొత్తం 7 జతల ఎడ్లు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన శివకృష్ణచౌదరి ఎడ్లు నిర్ణీత 20 నిమిషాల్లో 3767 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.80 వేలు సాధించాయి. నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బొరెడ్డి కేశవరెడ్డి ఎడ్ల జతలు రెండో బహుమతి, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్ద గొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లు మూడో బహుమతి, కురిచేడు మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన ఎం.బయ్యపురెడ్డి ఎడ్లు నాలుగో బహుమతి, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన తేజశ్రీరెడ్డి ఎడ్లు ఐదో బహుమతి, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ గ్రామానికి చెందిన డాక్టర్ హుసేన్ ఎడ్లు ఆరో బహుమతి, నంద్యాల మండలం ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన చల్లా వెంకటహారిక ఎడ్లు ఏడో బహుమతి గెలుపొందాయి. ప్రథమ బహుమతిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి బహూకరించారు.

రెచ్చిపోయిన దొంగలు


సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ నాగరాజు


వీరాయపాలెంలో చోరీ జరిగిన మధుమంచి ఏడుకొండలు ఇల్లు

- బేస్తవారిపేట మండలం పీవీ పురంలో ముగ్గురు సోదరుల గృహాల్లో దొంగతనం
- 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.65 వేల నగదు అపహరణ
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ
- కురిచేడు మండలం తూర్పువీరాయపాలెంలో మహిళ మెడలో గొలుసు చోరీ

బేస్తవారిపేట: ఇంటి యజమానులు ఆరుబయట నిద్రిస్తుండగా దొంగలు చేతివాటం చూపించారు. వరుసగా ఉన్న ముగ్గురు అన్నదమ్ముళ్ల గృహాల్లో 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.65 వేల నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన బేస్తవారిపేట మండలంలోని పీవీపురంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయాన్నే నిద్రలేచిన యజమానులు చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుల కథనం మేరకు.. పీవీ పురంలో అన్నదమ్ముళ్లు తమటం గురునారాయణరెడ్డి, తమటం జగన్‌మోహన్ రెడ్డి, తమటం చిన్నవెంకరెడ్డి గృహాలు వరుసగా ఉన్నాయి. కుటుంబ సభ్యులందరూ గురువారం రాత్రి ఆరుబయట, వరండాలో నిద్రపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు ఓ గృహం వెనుక వైపు తలుపు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఒక ఇంట్లో నుంచి మరో ఇంట్లోకి వెళ్లే అవకాశం ఉండటంతో వరుసగా ఉన్న మూడు ఇళ్లను లూటీ చేశారు. షెల్ఫ్‌ల్లో దుస్తుల కింద దాచిపెట్టిన బీరువా తాళాలు తీసుకుని చోరీకి పాల్పడ్డారు. తమటం గురునారాయణరెడ్డి గృహంలో 13 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు, చిన్న వెంకటరెడ్డి ఇంట్లో బంగారు ఉంగరం, రూ.5 వేల నగదు దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు, కంభం సీఐ కె.మల్లికార్జున, ఎస్సై రవీంద్రారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు క్లూస్ టీమ్ ఎస్సై శరత్‌కుమార్ వేలిముద్రలు సేకరించారు. పోలీస్ జాగిలాలు గృహాల వెనుక వైపున పొలాలు, పాఠశాల వద్దకు, గృహ పరిసరాల్లో తిరిగాయి. ఆ ఇళ్లపై పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తులే చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు.

వీరాయపాలెంలో నిద్రిస్తున్న మహిళల మెడలో..

దర్శి(కురిచేడు): దర్శి మండలంలోని తూర్పువీరాయపాలెం గ్రామంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రెండు ఇళ్లలో చోరీకి విఫలయత్నం చేశారు. పంచల్లో పడుకున్న మహిళల మెడల్లో నాలుగున్నర సవర్ల బంగారు గొలుసులు లాక్కుని పరారయ్యారు. వివరాలు.. తూర్పు వీరాయపాలెం గ్రామంలోని ముప్పరాజు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఇంటి వరండాలో నిద్రిస్తున్నారు. ఇద్దరు దొంగలు రాత్రి 12.30 గంటల సమయంలో ఇంట్లోకి గోడదూకి ప్రవేశించారు. నాగేశ్వరరావు భార్య పద్మ మెడలో బంగారు తాళిబొట్టు, నానుతాడు కట్ చేశారు. అయితే తాళిబొట్టు కిందపడటంతో పద్మకు మెళకువ వచ్చింది. లేచి చూసే సరికి దొంగలు తాడు తీసుకుని పరారయ్యారు. నాగేశ్వరరావు వెంటపడినా ఫలితం లేకపోయింది. అదే గ్రామంలో రాత్రి ఒంటి గంట తరువాత మధుమంచి ఏడుకొండలు కుటుంబ సభ్యులు వారి ఇంటి ముందు ఆరుబయట నిద్రిస్తున్నారు. ఏడుకొండలు భార్య గురువర్ధిని మెడలోని తాళిబొట్టు, నానుతాడు లాక్కుని పరారవుతుండగా ఏడుకొండలు వెంటపడ్డాడు. దొంగలు పొలాల్లో గుండా పారిపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు.

పెళ్లింట తీవ్ర విషాదం

- బావ పెళ్లికి వచ్చి మృత్యు ఒడిలోకి చేరిన యువకుడు
- వచ్చే శ్రావణ మాసంలోనే వివాహం నిశ్చయం


మృతిచెందిన శ్రీకాంత్

కొమరోలు: బావ వివాహ వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన బావమరిది పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగిరాని లోకాలకు చేరాడు. ఈ విషాద సంఘటన కొమరోలు మండలం యర్రపల్లె గ్రామం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు కొమరోలు మండలం మదవపల్లె గ్రామానికి చెందిన బైరగాని శ్రీకాంత్(23) నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో ప్రైవేట్ ఉద్యోగిగా జీవనం సాగిస్తున్నాడు. తన బావ మల్లికార్జున వివాహ వేడుకల్లో పాల్గొనడానికి 4 రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. దగ్గరుండి పెళ్లి పనులు చూడసాగాడు. శుక్ర, శనివారాల్లో మృతుడి బావ మల్లికార్జున వివాహ వేడుకలు నిర్వహించడానికి పెద్దలు ఏర్పాట్లు చేశారు. పెళ్లికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేయడానికి కొమరోలుకు బైక్‌పై వెళ్లి వస్తున్న శ్రీకాంత్‌ను యర్రపల్లె గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. అదే సమయంలో కడప వైపు వెళ్తున్న లారీ రోడ్డుపై పడిపోయిన శ్రీకాంత్ మీదుగా వెళ్లడంతో శరీర భాగాలు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో వైఎస్సార్ కడప జిల్లా బూరవారిపల్లె గ్రామానికి చెందిన బట్టపోతుల నారాయణ కాలు విరిగింది. క్షతగాత్రుడిని ప్రైవేట్ వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

మరో రెండు నెలల్లో శ్రీకాంత్‌కు వివాహం

మృతుడు శ్రీకాంత్‌కు మరో రెండు నెలల్లో వివాహం కావాల్సి ఉంది. గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన యువతితో నెల రోజుల క్రితం పెద్దల సమక్షంలో నిశ్చితార్థ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్ మృత్యువాతపడటంతో తల్లిదండ్రులు రంగమ్మ, నడిపి తిరుమలయ్య గుండెలవిసేలా విలపించారు. వివాహానికి వచ్చిన బంధువులంతా సంఘటన స్థలంలో కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటన స్థలాన్ని ఎస్సై నాగరాజు పరిశీలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సంఘటన స్థలం వద్ద మృతదేహాన్ని చూసి విలపిస్తున్న శ్రీకాంత్ బంధువులు

తనిఖీల్లో కిరికిరి.. థియేటర్లపైనే గురి!

సాక్షి నెట్‌వర్క్: 'కూటమి ప్రభుత్వంపై సినీ పరిశ్రమకు కృతజ్ఞత లేదు. మీ కోసం ఎంతో చేస్తే ఇలా రిటర్న్ గిఫ్ట్ ఇస్తారా..' అంటూ ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. థియేటర్లకు అద్దె కాకుండా షేర్ ఇవ్వాలని యజమానుల యూనియన్ కోరిన నేపథ్యంలో బంద్ ప్రస్తావన తెరపైకి రావడం, దీనిపై లోతుగా విచారించాలని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. థియేటర్లలో వసతులు, టికెట్ ధరలు, తినుబండారాల ధరలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం కార్యాలయం ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలోనూ శుక్రవారం తనిఖీలు ప్రారంభించారు. అయితే నేరుగా థియేటర్లను మాత్రమే తనిఖీ చేస్తే ప్రజల్లోకి మరో విధంగా సందేశం వెళ్తుందని భావించిన కూటమి పాలకులు రూటు మార్చారు. పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఆర్టీసీ డిపోలు తదితర వ్యాపార కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించడం గమనార్హం.


పొదిలిలో థియేటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్


బేస్తవారిపేటలో మూతపడిన ఊర్వశి థియేటర్‌లో తనిఖీ


గిద్దలూరులో ఓ సినిమా థియేటర్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్


ఒంగోలులో సినిమా హాల్ క్యాంటీన్‌లో ఆర్డీఓ తనిఖీ


సింగరాయకొండలోని శాంతి థియేటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్